నాయకులు ఇచ్చిన హామీ ఎక్కడ...?

విశాలాంధ్ర - పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డు, అంబేద్కర్ నగర్, వాంబే కాలనీలో ఓ నిరుపేద కుటుంబం గత ఏడాది కాలంగా శిధిలమైన గదిలో బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. గత ఏడాది కురిసిన భారీ వర్షాలు కారణంగా కొండవాగు ద్వారా రాళ్లు పడి లక్ష్మి అనే మహిళ ఇంటి గోడలు కూలిపోయాయి. ఆ సమయంలో స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ సహా అధికారులు ఆమె ఇంటికి వచ్చి ప్రభుత్వం నుండి సాయమం దిస్తామని హామీ ఇచ్చారు. శిధిలమైన ఇంటిని పునర్నిర్మిస్తామని తెలిపారు. అయితే ఏడాది కాలం గడుస్తున్నా ఇప్పటివరకు ఆమె ఇంటివైపు ఏ ఒక్కరు కన్నెత్తైనా చూడలేదు. దీంతో లక్ష్మి కుటుంబం అంతా శిధిల

శిధిలమైన గదిలో బిక్కుబిక్కుమంటూ బతుకుతున్న కుటుంబం

గదిలోనే బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. వర్షాలకు తడుస్తూ ఎండకు ఎండుతూ బతుకీడుస్తున్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని ఆ కుటుంబం సొంతంగా ఇంటి మరమ్మతులు చేయించుకోలేక ప్రభుత్వం నుండి సాయం అందుతుందనే ఆశతో ఎదురుచూస్తున్నారు. కొండవాలు ప్రాంతం కావడంతో పాములు ఎలుకలు ఇంటిని చుట్టుముడుతున్నాయి. తమ గోడును మీడియాకు వెల్లడిస్తూ లక్ష్మి కుటుంబం ఆందోళన వెలిబుచ్చారు. శిధిలమైన గోడల్లో బతుకుతున్న తమకు ప్రమాదం పొంచి ఉందని అధికారులు, నాయకులు ఇప్పటికైనా న్యాయం చేయాలని ప్రాధేయ పడుతున్నారు. ఇకనైనా ఆ బాధిత కుటుంబానికి న్యాయం జరుగుతుందని ఆశిద్దాం.

జీవీఎంసీ కార్యాలయం వద్ద సచివాలయ కార్యదర్శులు ధర్నా

పారిశుద్ధ్య కార్యదర్శి మృతికి కారణమైన జెడ్సీని సస్పెండ్ చేయాలి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: నగరంలో చెత్త పన్ను యూజర్ చార్జీలు సచివాలయ పారిశుద్ధ్య కార్యదర్శులు వసూలు చేయాలని జోనల్ కమిషనర్లు ఒత్తిడి తీసుకొచ్చి తమ సహచర పారిశుద్ధ్య కార్యదర్శి చంద్రమోహన్ మృతికి కారణమైన జోన్ 4 జోనల్ కమిషనర్ చక్రవర్తిని సస్పెండ్ చేయాలని కోరుతూ జీవీఎంసీ పరిధిలో ఉన్న సచివాలయ పారిశుద్ధ్య కార్యదర్శులు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద బుధవారం రాత్రి కొవ్వొత్తులతో ఆందోళన చేపట్టి అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద బైఠాయించారు. జోన్ 4 పరిధిలో 30 వార్డు 180వ సచివాలయం పారిశుధ్య వార్డు కార్యదర్శి చంద్రమోహన్ ప్రజలతో చెత్త పన్ను యూజర్ చార్జీలు వసూలు చేయడం లేదని జోనల్ కమిషనర్ చక్రవర్తి తీవ్ర ఒత్తిడి తీసుకురావడంతోనే గత రెండు రోజుల క్రితం గుండెపోటుకు గురై ఆసుపత్రిలో చేరారని చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందినట్లు సహచర సచివాలయ కార్యదర్శులు మీడియాకు తెలియజేశారు. బలవంతంగా ప్రజలు చెల్లించకపోయిన తాము యూజర్ చార్జీల ధనం జీవీఎంసీ కి ఇవ్వాలని జోనల్ కమిషనర్ చెప్పడం అన్యాయమన్నారు. అందులో భాగంగానే చంద్రమోహన్ పేరిట రెండు లక్షలు యూజర్ చార్జీలు కట్టేందుకు అడ్వాన్స్ గా ఆన్లైన్ చేసిన 30 వార్డు సానిటరీ ఇన్స్పెక్టర్ చిన్నాజీ రావు ఒత్తిడి తీసుకురావడంతో మృతి చెందిన సచివాలయ కార్యదర్శి చంద్రమోహన్ పర్సనల్ లోన్ తీసుకొని రూ. 50 వేలు కూడా చెల్లించినట్లు సహచర కార్యదర్శులంతా మీడియాకు వెల్లడించారు. ప్రజలు యూజర్ చార్జీలు చెల్లించకపోతే తమని అధికారులు వేధించడం సరికాదని మండిపడ్డారు. తమ సొంత డబ్బులు చెల్లించలేమని తెగేసి చెప్పారు. జోనల్ కమిషనర్ చక్రవర్తి సచివాలయ ఉద్యోగులను రాగింగ్ చేస్తున్నారని, మహిళా ఉద్యోగులను కూడా అసభ్యకర పదజాలంతో మాట్లాడుతూ వేధిస్తున్నారని వారంతా మండిపడ్డారు. కనీసం సిఎల్ కూడా ఇవ్వడం లేదన్నారు. టార్గెట్లు పెంచి తమ ఆరోగ్యాన్ని పాడుచేస్తూ మానసిక ఒత్తిడిని మరింత పెంచుతున్నారని మండిపడ్డారు. తక్షణ మృతి చెందిన చంద్రమోహన్ కుటుంబానికి న్యాయం చేయాలని వేధింపులకు గురిచేసిన జోనల్ కమిషనర్ చక్రవర్తిని సస్పెండ్ చేసి చట్టపరంగా శిక్షించాలని వీరంతా డిమాండ్ చేశారు. రాత్రి 8:30 గంటల వరకు ఆందోళన కొనసాగడంతో చీఫ్ మెడికల్ ఆఫీసర్ కే ఎల్ జి శాస్త్రి వచ్చి జరిగిన సంఘటనపై విచారణ జరుపుతామని హామీ ఇచ్చారు. మృతుని కుటుంబానికి న్యాయం చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

నేటి నుండి ఇంటింటా ధర్మప్రచారం

విశాలాంధ్ర - రాంబిల్లి: సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం నుండి ఇంటింటా ధర్మ ప్రచారం నిర్వహిస్తున్నట్లు, 25వ తేదీ గ్రామ కన్వీనర్ల శిక్షణా కార్యక్రమం ఉంటుందని సమరసతా సేవా ఫౌండేషన్ సబ్ డివిజన్ ధర్మ ప్రచారకులు కొల్లి అప్పారావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13వ విడత ఇంటింటా ధర్మప్రచారం ప్రతీ గ్రామంలో జరగాలని, ప్రతీ ఇంటిని కలిసి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకోవాలన్నారు. ఈనెల 25న అచ్యుతాపురంలో జరిగే గ్రామ కన్వీనర్ల శిక్షణా కార్యక్రమానికి ప్రతి గ్రామం నుండి ఇద్దరు పాల్గొనాలని ఆయన కోరారు. మండల కన్వీనర్ సూరాడ నూకరాజు మాట్లాడుతూ కొత్తపేట రెల్లివీధిలో టీటీడీ నిధులతో నూతనంగా నిర్మించబోయే దుర్గమ్మ ఆలయానికి భూమి పూజ జరుగుతుందన్నారు. అనంతరం కరపత్రాలను, స్టిక్కర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ ధర్మ ప్రచార కులు కొల్లి అప్పారావు, కన్వీనర్ సూరాడ నూకరాజు, కొప్పు గొండపాలెం సర్పంచ్ బద్ది హరిబాబు, వాడనర్సాపురం మాజీ సర్పంచ్ సిహెచ్ ఎల్లయ్య, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డివి గోవిందరెడ్డి, ఎన్.శ్రీని వాసరావు, జి.అప్పారావు, అప్పలకొండ, సిహెచ్ మంగరాజు, పూడి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయండి

విశాలాంధ్ర - హుకుంపేట: 2023-24 సంవత్సరాలకు గాను గ్రామాల్లో అభివృద్ధి పనులు గుర్తించాలని ఎంపీపీ రాజుబాబు పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద 33 పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజులు నిర్వహించే శిక్షణకు మొదటి రోజు స్థానిక ఎంపీపీ కూడా రాజుబాబు ముఖ్యతిథిగా పాల్గొన్నారు. పంచాయతీలోను, గ్రామాల్లోను డ్రైనేజీలు, తాగునీటి పథకాలు, సాగునీటి పథకాలతో పాటు ప్రజలకు ఉపయోగ పడే ప్రతి అభివృద్ధి పనిని గుర్తించాలని కోరారు. 2023-24 సంవత్సరాల్లో నిర్వహించే ఈ పనులకు కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు సమన్వయ పరచుకొని ప్రణాళికలు సిద్ధం చేస్తే సచివాలయ సిబ్బంది ఆన్లైన్లో అప్లోడ్ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మత్స్యలింగం, ఎంపీడీవో వెంకటరమణ, ఏటీడబ్ల్యూవో రజిని, ఏవో సరోజిని, ఎంఈవో రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రఘురామరాజు పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర - మల్కాపురం: రాష్ట్ర టీఎన్టీయూసీ అధ్యక్షులు గొట్టుముక్కల రఘురామ రాజు పుట్టినరోజు సందర్భంగా హెచ్పీసీఎల్ లేబర్ గేటు ఎన్టీఆర్ విగ్రహం వద్ద విశాఖ పార్లమెంట్ టీఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి నక్క లక్ష్మణరావు ఆధ్వర్యంలో కేక్ కటింగ్ నిర్వచారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.ఆది, ఆర్మీ శ్రీను, జయశంకర్, హిందుస్థాన్ షిప్‌యార్డ్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రంజాన్ ప్రసాద్, క్లబ్ రమణ, నేవల్ డాగ్ యాడ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు పొక్కల కృష్ణ, ఏకేసి సురేష్, కోరమండల్ ఫెర్టిలైజర్స్ కాంట్రాక్ట్ వర్కర్ యూనియన్ నాయకులు పోతా బత్తుల నర్సింగ్, ఉరుకూటి హరి యాదవ్, 59వ వార్డు అధ్యక్షులు ఉరుకూటి మహేష్, విశాఖ జిల్లా కాంట్రాక్టర్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి తారక్, కోశాధికారి చెల్లిబోయిన శ్రీను పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

ఎంపీపీ మళ్ళ జయలక్ష్మి

విశాలాంధ్ర - మునగపాక: మండలంలో చాలా గ్రామాల్లో జగనన్న ఇళ్ల నిర్మాణం నత్తనడకన సాగుతుందని వేగవంతంగా పనులు పూర్తి అవ్వడానికి సంబంధిత శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆమె కోరారు. నిన్న జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో కూడా యలమంచిలి శాసనసభ్యులు యు.వి రమణమూర్తి రాజు జగనన్న ఇల్ల నిర్మాణాలపై అసహనం వ్యక్తం చేసిన విషయం అధికారులకు అందరికీ తెలిసిందేనని ఆమె గుర్తు చేశారు.యలమంచిలి నియోజకవర్గంలో మూడు మండలాల్లో జగనన్న కాలనీలో పనులు వేగవంతంగా జరుగుతుండగా మునగపాకలో జరగకపోవడానికి కారణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఎంపీపీ సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రవికుమార్,పిఆర్ఏఈ చంద్రశేఖర్,హౌసింగ్ ఏఈ సిబ్బంది పాల్గొన్నారు.

మూడో గురువారం పూజలకు విస్తృత ఏర్పాట్లు

విశాలాంధ్ర - వన్‌టౌన్: శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో జరుగుతున్న మార్గశిర మహోత్సవంలో భాగంగా మూడో గురువారం పూజలకు విస్తృత చేసినట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.శిరీష తెలియజేశారు. గత రెండు గురువారాల్లో నిర్వహించిన ఏర్పాట్లను సమీక్షించుకొని మూడో గురువారం సందర్భంగా భక్తులు తాకిడి అధికంగా ఉండనున్న నేపథ్యంలో ఎక్కడా ఎటువంటి సంఘటనలు జరగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే క్యూలైన్లను పటిష్టంగా ఏర్పాటు చేశామని మరోవైపు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నట్లు చెప్పారు. క్యూలో ఉన్న ప్రతి భక్తునికి సులువుగా దర్శనం జరిగేలా చర్యలు చేపట్టామని వృద్ధులు, గర్భిణీలు, పిల్లలు, మహిళలకు ప్రత్యేక ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పిల్లలకు పాలిచ్చేందుకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేశామని వికలాంగులు, వృద్ధులకు వీల్ చైర్స్ ఉన్నాయని తెలిపారు. దేవస్థానం ధర్మకర్తల మండలి, అధికారులు, సిబ్బంది సహకారంతో మూడో గురువారం పూజలకు గట్టి చర్యలు చేపట్టామని అన్నారు. ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని, జగన్నాథ స్వామి దేవస్థానంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కె.శిరీష పేర్కొన్నారు.

రెండవ శనివారం సెలవు తప్పనిసరి: జిప్సా

విశాలాంధ్ర - గాజువాక సిటీ: రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డా.గొండు సీతారాం సూచన మేరకు గాజువాక పరిధిలో గల అన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలవారు విధిగా ప్రతీ నెల రెండవ శనివారం తోపాటు ప్రభుత్వం సూచించిన సెలవు దినాల్లో ఎటువంటి తరగతులు నిర్వహించరాదని గాజువాక ప్రైవేటు సంక్షేమ సంఘం (జిప్సా) అధ్యక్షుడు పి.భాస్కరరావు తెలిపారు. సెలవుదినాల్లో కూడా తరగ తులు నిర్వహించడం కమిషనర్ దృష్టికి వెళ్లిందని ఇక నుంచి పాఠశాలలు సెలవు దినాల్లో నిర్వహించరాదని భాస్కరరావు తెలిపారు.

విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ఉండాలి

విశాలాంధ్ర - డుంబ్రిగుడ: పాఠశాల స్థాయిలో ఉన్నత చదువులతోపాటు, ఆత్మ స్థైర్యాన్ని కలిగి ఉండాలని సీడీపీవో నీలిమ అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ గురుకుల బాలికల పాఠశాలలో లైంగిక వేధింపులు, మహిళ చట్టాలపై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలు గౌరవించేలా ప్రభుత్వం ప్రత్యేక చట్టాలను అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలతోనే అభివృద్ధి

విశాలాంధ్ర - మధురవాడ: జోన్ 2 పరిధిలోని 7వ వార్డు ప్రజలకు ముఖ్య అవసరమైన నీటి సదుపాయంపై దృష్టిసారించి పరిష్కరిస్తున్నామని ఆ వార్డు కార్పొరేటర్ పిల్లా మంగమ్మ వెంకటరావు అన్నారు. బుధవారం వాంబే కాలనీ సీ బ్లాక్ వద్ద బోరును వారు ప్రారంభించారు. వార్డు పరిధిలో ప్రజలకు త్రాగునీటి సమస్య ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి 6 చేతి పంపు బోర్లను జీవీఎంసీ నిధులతో వేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాలన పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

తుఫాన్‌తో రైతుల ఆందోళన

విశాలాంధ్ర - దేవరాపల్లి: రాష్ట్ర ప్రభుత్వం తుఫాను హెచ్చరికలు జారీ చేయడంతో ముమ్మరంగా వరి కోతలతో బిజీబిజీగా గడుపుతున్న వేళ ఈ తుఫాన్ దెబ్బకు రైతన్నల్లో గుబులు మొదలైంది. బుధవారం సాయంత్రం తుఫాన్ తీవ్రత పెరుగుతుందన్న భయాందోళనలతో ఇప్పటికే వరి కోతలు కోసిన వరిచేను మడుల్లో కుప్పలు పెట్టే బిజీలో గడుపుతున్నారు. చాలామంది రైతులు వరి కోతలు కోసి పంట అంతా నేలపై ఉందని ఈ తుఫాన్ కారణంగా వర్షం పడినట్లు అయితే నష్టం తప్పదని రైతన్నలు వాపోతున్నారు. పండిన పంట కోసుకొని కుప్పలు వేసుకునే వరకు వరుణ దేవుడు కరుణించాలని రైతులు ప్రార్థిస్తున్నారు.

బీసీ మహాసభకు తరలిన నాయకులు

విశాలాంధ్ర - గోపాలపట్నం: విజయవాడలో జరుగుతున్న జయహో బి.సి మహాసభకు పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో నాయకులు తరలి వెళ్లారు. పశ్చిమ నియోజకవర్గ 89, 90, 91, 92 వార్డుల నాయకులు జి.వి.ఎం.సి కో - ఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు, 90వ వార్డు చుక్క ప్రసాద్ రెడ్డి, దొడ్డి సతీష్, యల్లపు వేంకటేశ్వరరావు, ఆళ్ళ పైడిరాజు, అయితంసెట్టి గోపి, 92వ వార్డు అధ్యక్షులు గొర్లె అప్పలస్వామి నాయుడు, ఊటపల్లి గోవింద్, బురెడ్డి గోపి, గొంతిన జగదీష్, బాలు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించి డ్రైన్లు నిర్మించాలి

విశాలాంధ్ర - పాయకరావుపేట: పట్టణంలోని దుర్గానగర్‌లో ప్రధాన రహదారి వెంట నిర్మిస్తున్న డ్రైనేజీ పనులు ఆక్రమణలు తొలగించిన తర్వాతనే డ్రైనేజీ నిర్మించాలని ఎంపీటీసీ మల్లపురెడ్డి రమాకుమారి డిమాండ్ చేశారు. స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ దుర్గానగర్ ప్రధాన రహదారి 36 అడుగులు మిన హాయించి డ్రైను నిర్మించాలని, అప్పటి వరకు జరుగుతున్న డ్రైనేజీ పనులు నిలిపి వేయాలని జిల్లా కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇటీవల రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించారని తెలిపారు. అయితే పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధులతో ఆక్రమణలు తొలగించకుండా డ్రైనేజీ నిర్మిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే 50శాతం డ్రైన్లు నిర్మించారని, మిగిలిన పనులను స్థానికులు నిలిపివేశారని తెలిపారు. రెవెన్యూ అధికారులు సర్వే చేస్తే రోడ్డు 36 అడుగులే కాక ఒక్కొక్క ప్రదేశంలో 50 అడుగులు కూడా ఉందని తెలిపారు. అయితే ఆక్రమణల కారణంగా ఒక్కో చోట 9 అడుగుల రోడ్డు కూడా లేదని తెలిపారు. దీని కారణంగా పెద్ద పెద్ద వాహనాలు వస్తే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతున్నారని తెలిపారు. అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకొని 36అడుగుల రోడ్డు ఏర్పాటు చేసి అనంతరం డ్రైనేజీ నిర్మించాలని మల్లపురెడ్డి రమాకుమారి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆకుల ఏసుబాబు, కొమ్మిరెడ్డి నాగేశ్వరరావు, దండెం నరసింహ ప్రహ్లాద్, వీసం కోటి, ముత్తుర్తి ధనరాజు, పోలరాజు శివ, కొట్టేటి అప్పారావు, రాయి దివాణం తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నివారణకు ప్రత్యేక చర్యలు

విశాఖ రేంజ్ డీఐజీ హరికృష్ణ

విశాలాంధ్ర - యస్.రాయవరం: గంజాయి నివారణకు ప్రత్యేక చర్యలు తీసు కుంటున్నట్లు విశాఖ రేంజ్ డీఐజీ హరికృష్ణ తెలిపారు. బుధవారం మండలంలోని అడ్డురోడ్డులో నక్కపల్లి సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో గంజాయి సాగు చేయకుండా స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారంతో సాగు చేసేవారికి అవగాహన కల్పించడం జరుగుతుందని అన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా వివిధ రకాల పంటలు సాగు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రక్కన ఉన్న ఒరిస్సా నుంచి గంజాయి రవాణా జరుగుతున్న సమాచారంతో తనిఖీలు చేయగా ఈ ఏడాది లక్ష 30 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసి పలువురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. నక్సల్స్ ప్రభావం తగ్గిందని ఇప్పటికే జిల్లాల విభజన జరగడంతో పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు నివారించేం దుకు ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నారని తెలిపారు. అంతకుముందు సర్కిల్ కార్యాలయం, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఎస్పీ గౌతమి శాలి, నర్సీపట్నం డీఎస్పీ కె.ప్రవీణ్ కుమార్, నక్కపల్లి సిఐ వి.నారాయణరావు, యలమంచిలి సిఐ ఎస్.కె.గపూర్, ఎస్సైలు ప్రసాదరావు, శిరీష్, ట్రాఫిక్ ఎస్సై ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఏయూతో గరుడలైటిక్స్ ఎంఓయూ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఆంధ్రవిశ్వవిద్యాలయంతో గరుడ లైటిక్స్ సంస్థ అవగాహన ఒప్పందం చేసుకుంది. బుధవారం ఉదయం ఏయూ ఇంజనీరింగ్ కళాశాల వైవీఎస్ మూర్తి ఆడిటోరియం వేదికగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సమక్షంలో ఒప్పంద ప్రతాలను ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, గరుడలైటిక్స్ సంస్థ నిర్వాహకులు డాక్టర్ వి.ఎస్.ఎస్ కిరణ్‌లు సంతకాలు చేసి మార్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాద రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ప్రత్యక్ష జ్ఞానాన్ని అందించే దిశగా వివిధ పరిశ్రమలతో కలసి పనిచేస్తున్నామన్నారు. విద్యార్థులు నిరంతర అభ్యాసకులుగా నిలవాలని సూచించారు. భవిష్యత్తులో డ్రోన్స్ వినియోగం గణనీయంగా పెరుగుతుందని, పర్యవేక్షణ, నిర్వహణ, సర్వే, ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేయడం వంటి అంశాలలో డ్రోన్స్ వినియోగిస్తారన్నారు. డ్రోన్‌లో శిక్షణ, సమాచార విశ్లేషణ జరిపే జిఐఎస్ రంగాలలో పనిచేస్తున్న రెండు సంస్థలతో వరుసగా అవగాహన ఒప్పందాలు చేసుకోవడం జరిగిందన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య పేరి శ్రీనివాసరావు మాట్లాడుతూ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దే విధంగా సిలబస్‌లో మార్పులను చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య వజీర్ మహ్మద్, రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, అకడమిక్ డీన్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు, ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు మెరుగు పర్చాలి

- కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఉత్తరాంధ్ర జిల్లాలో ప్రముఖ వైద్యశాల అయిన కె.జి.హెచ్‌కు ప్రతి రోజు అనేక మంది రోగులు వైద్యం కోసం వస్తుంటారని వారికి కనీస సౌకర్యాలు అందేటట్లు వైద్య సిబ్బంది చూడాలని జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున అన్నారు. బుధవారం ఉదయం స్థానిక కె.జి.హెచ్ ఆసుపత్రిలో ఒపి స్లిప్, కేస్ షీట్లు మంజూరు చేయు గదిని, క్యూలైన్లను పార్కింగ్ ప్రదేశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేస్ షీట్లు మంజూరు చేయు గదిని మరమ్మత్తులు చేయాలని అదే విధంగా రోగులు ఒపి స్లిప్ లు పొందేందుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. రోగులతో పాటు వచ్చే వారికి కూడా మరుగుదొడ్లు ఇబ్బంది లేకుండా నిర్మించాలన్నారు. పార్కింగ్ సదుపాయాన్ని మెరుగు పర్చాలన్నారు. ఓపి గేటు ఎదురుగా ఉన్న మినీ పార్కును సుందరీకరిం చాలని ఆదేశించారు. అనంతరం వైద్యం కోసం వచ్చిన రోగులతో మాట్లాడి వారికి అందుతున్నవైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కె.జి.హెచ్ సూపరింటెండెంట్ మైథిలీ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీ నరసింహ స్వామి వారిని సినీ ప్రొడ్యూసర్ సి.కళ్యాణ్, శబరిమల అలయ మేల్ బ్రహ్మశ్రీ వరమేశ్వరన్ నంబూరి తదితరులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి ముందుగా కప్ప స్తంభం ఆ లింగనము చేసుకున్నారు. ఆలయ సహాయ కార్య నిర్వహణాధికారి నంసింహారాజు స్వామివారి ప్రసాదాలను అందించారు. వీరితో లంక సూరిబాబు తదితరులు ఉన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర - పరవాడ: వైఎస్ఆర్ కంటి వెలుగు పథకంలో భాగంగా పరవాడ మండలం వాడచీపురుపల్లిలో గురువారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వి.హేమసుం దరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విశాఖ జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో శిబిరాన్ని నిర్వహిస్తున్నా రన్నారు. గ్రామంలో స్థానిక సామాజిక భవనం వద్ద ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి వైద్య సిబ్బంది వైద్య సేవలు అందిస్తారని చెప్పారు. మరిన్ని వివరాలకు 8309966963, 9441107432 అను ఫోన్ నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ఇదేం ఖర్మ కార్యక్రమంలో పైలా

విశాలాంధ్ర - బీడికాడ: జిల్లా కేంద్రమైన అనకాపల్లిలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు, అనిత, జిల్లా ఇన్‌చార్జి బుద్దా నాగజగదీష్ ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ బీసీలకు కార్యక్రమం నిర్వహించారు. వారితోపాటు టీడీపీ మాడుగుల నియోజకవర్గం నాయకులు పైలా ప్రసాదరావు పాల్గొని మాట్లాడారు. వేల కోట్ల రూపాయల బీసీ సబ్ ప్లాన్ నిధులు ప్రభుత్వం దారి మళ్లించిందన్నారు. ఈ కార్యక్రమంలో లాలం భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు నిత్యావసరాలు పంపిణీ

విశాలాంధ్ర - సీలేరు: ఏపీ జెన్‌కో సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో ఏఈఈగా పని చేస్తున్న పవన్ ప్రియరాజ్, భార్య చంద్రికల కుమార్తెలు ప్రియ మాన్విత, ప్రియ చార్విత‌ల పుట్టిన రోజు సందర్భంగా జికెవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ వలసగెడ్డ కాలనీ కొత్తూరు, రవ్వగూడ గ్రామాలకు చెందిన పేద దివ్యాంగులకు అవస రమైన దుప్పట్లు, నిత్యావసర వస్తువులను అందజేశారు.

వరి కోతలు వాయిదా వేసుకోండి

విశాలాంధ్ర - కె.కోటపాడు: ఈ నెల 9, 10, 11వ తేదీలలో వర్ష సూచన ఉన్నందువల్ల వరికోతలు వాయిదా వేసుకోవాలని మండల వ్యవ సాయ అధికారి సోమశేఖర్ రైతులకు సూచించారు. ఇప్పటికే వరి కోత పూర్తయితే పంటను కుప్పలు వేసుకొని జాగ్రత్త చేసుకోవాలని తెలిపారు. స్వయంగా వరి కోత అవుతున్న పొలాలు వద్దకు వెళ్లి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

బహిరంగంగా ఉత్సవాలు, సేవలు చేస్తే మేలు

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం, దేశ, విదేశీయుల ఆరాధ్య శ్రీ వరాహాలక్ష్మీ నరసింహ స్వామివారి సన్నిధిలో వార, పక్ష మాసోత్సవాలు ఏకాంతంగా కాకుండా బహిరంగంగా జరిపిస్తే దేవాల యానికి భక్తులతోపాటు ఆదాయం కూడా మరింత పెరిగే అవకాశం ఉంటుందని భక్తులు, స్థానికులు అంటున్నారు. ప్రతి గురువారం ప్రధాన పిరాట్టమార్లు, సింహావల్లి, తాయారు అమ్మవార్లకు అభిషేకం జరుగుతుంది. ప్రతి శుక్రవారం ఆండాళ్ (గోదాదేవి) అమ్మవార్లకు చక్కెర పొంగలి, బూరెలు, దద్దోజనం ప్రసాదాల నైవేద్యంతో అభిషేకం జరుగుతుంది. ప్రస్తుతంపై రెండు ఉత్సవాలు ఆరాధన సమయంలో ఏకాంతంగా జరుగుతున్నాయి. పక్షోత్సవం (బహుళ, శుద్ధ) ఏకాదశినాడు (శయనమందిరంలో) మండ పంలో కొలువై ఉన్న మదనగోపాలస్వామి వారికి అప్పాలు, శీర నైవేద్యంతో అభిషేకం జరుగుతుంది. మాసోత్సవం ప్రతి నెల పౌర్ణమి ఉత్సవమూర్తులకు అష్టోత్తర శత కలశాభిషేకం, సాయంత్రం గ్రామ గరుడసేవ (తిరువీధి) నాలుగు హారాలు (పులిహోర, దద్దోజనం, పొంగలి, చక్కెరపొంగలి) నైవేద్యంతో జరుగుతున్నాయి. వార, పక్ష, మాస ఉత్సవాలు ఉదయం గం.7 నుండి 9 వరకు బేడామండపం హంసమూల ఆర్జితం, అభిషేకం పేరుతో భక్తులకు, దాతలకు కనీస ప్రవేశ రుసుంతో బహిరంగంగా ఉత్సవాలు జరిపితే దేవస్థానం పేరు మరింత అభివృద్ధి చెందుతుందని పలువురు అంటున్నారు. ప్రస్తుతం దూపదీప, నైవేద్యాలకు ఉన్న సిబ్బంది 24 మందిలో 4గురు సీతారామ స్వామివారి ఆలయం, వేంకటేశ్వరస్వామి ఆలయం, మాధవస్వామి ఆలయం మొదలగు దేవాలయాలకు పంపించటం జరిగింది. ఉన్న సిబ్బంది 20మంది మాత్రమే వీరిలో అడపా దడపా సెలవులు పెట్టటం జరుగుతున్నాయి. ఈ విషయమై పలుమార్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ అనేక మంత్రులతోపాటు ఆ శాఖ ఉన్నతాధికారులైన ప్రధాన కార్యదర్శులకు, కమిషనర్లకు విన్నపాలు చేయటం జరుగుతోంది కాని ఆచరణ శూన్యం అని మనోవేదన చెందుతున్నారు. దీనిపై కార్యనిర్వహణాధికారి వారు సరైన నిర్ణయం తీసుకుని ప్రధాన అధికారులకు సమస్యను వివరించి స్వామివారికి మేలు చేస్తే బాగుంటుందని వైదిక పెద్దలు, భక్తులు, స్థానికులు కోరుకుంటున్నారు.

పని ప్రదేశాల్లో మహిళలపై హింస నిర్మూలించాలి

బీచ్‌రోడ్‌లో అంగన్వాడి టీచర్లు ర్యాలీ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులు నియంత్రణ చేయాలని కోరుతూ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో భాగంగా బుధవారం బీచ్ రోడ్‌లోని వైఎంసిఏ వద్ద 2 కె మారథన్ నిర్వహించారు. "మహిళలపై హింస వద్దు సురక్షిత సమాజమే ముద్దు" అనే నినాదంతో వుడాపార్కు నుంచి వైఎంసిఏ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ని దిశ జడ్జి బుల్లి కృష్ణ ప్రారంభించారు. ఆడ, మగ అని తారతమ్యం లేకుండా జిల్లాలో మహిళలందరికీ వేధింపుల చట్టంపై అందరికి అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డి.వెంకటేశ్వరి మాట్లాడుతూ అనేక రంగాల్లో పనిచేస్తున్న మహిళలు పని ప్రదేశాల్లో వేధింపులు లేకుండా చూడాలని, ఎలాంటి ఫిర్యాదులు వచ్చిన తక్షణమే పరిష్కారం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ మోహన్ లక్ష్మీ, విశాఖ అర్బన్ 1 సిడిపిఓ ఎంవి.రమణకుమారి, అర్బన్ 2 సిడిపిఓ జి. శ్రీలత, భీమిలి ప్రాజెక్టు సిడిపిఓ ఎం.శ్రీదేవి, పెందుర్తి సిడిపిఓ డి.నీలవేణి, జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ, ఐసిడిఎస్ సూపర్వైజర్లు అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల పోస్టు మూడు లక్షలు...!

జీవీఎంసీలో మొదలైన బేరసారాలు

రంగంలోకి దిగిన పలువురు అధికార పార్టీ కార్పొరేటర్లు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రోడ్లు ఊడ్చి, కాలవలు క్లీన్ చేసి, నిరంతరం జీవీఎంసీ పరిధిలో ఉన్న వార్డుల్లో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేసేందుకు పోస్ట్ కావాలంటే మూడు లక్షలు చెల్లించాల్సిందే. జీవీఎంసీ పారిశుద్ధ్య కార్మికుల పోస్టులు భర్తీలో తమ సిఫార్సులకే పెద్దపీట వేయాలని కొంతమంది దళారి నేతలు, పలువురు అధికార పార్టీ కార్పొరేటర్లు రంగంలోకి దిగి అధికారులపై ఒత్తిడి ప్రారంభించినట్లు విశ్వాసనీయ సమాచారం ద్వారా తెలిసింది. నగరంలో పారిశుద్ధ్యన్ని మరింత మెరుగుపరచాలని, పెరుగుతున్న నగర విస్తరణ నేపథ్యంలో పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను మరింత పెంచాలని గతంలో కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేసి కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి జీవీఎంసీ అధికారులు కోరారు. పారిశుద్ధ్య కార్మికుల పోస్టులకు మంజూరుకు ప్రభుత్వం నుండి అనుమతి పొందడంతో ఇటీవల కమిషనర్ రాజబాబు మీడియా ముఖంగా ఔట్సోర్సింగ్ కార్పొరేషన్ ద్వారా ఖాళీలను భర్తీ చేస్తామని వెల్లడించారు. దీంతో ఆన్ లైన్ లో ఆప్కోస్ ద్వారా 482 ఖాళీ పోస్టులు భర్తీకి అధికారులు శ్రీకారం చుడితే దాన్ని కొంతమంది దళారి నేతలు, పలువురు అధికార పార్టీ కీ చెందిన కీలక కార్పొరేటర్లు రంగంలోకి దిగి బేరసారాలు హడావిడిగా జరుగుతున్నట్లు సమాచారం. అయితే ఖాళీ పోస్టులను తమ వార్డులో తామే భర్తీ చేసుకుంటామంటూ పలువురు కార్పొరేటర్లు కోరుతున్నట్లు మేయర్ కమిషనర్ కు తెలియజేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆప్కోస్ ద్వారానే పోస్టులు భర్తీ చేయాలని నోటిఫికేషన్ విడుదల చేయడంతో నామినేషన్ పద్ధతిలో భర్తీకి బ్రేక్ పడింది. అయితే ఆన్‌లైన్‌లో అప్లై చేయించే పనిలో కొంతమంది నేతలు నిమగ్నమైనట్లు తెలుస్తోంది. ఆప్కోస్ కమిటీలో జిల్లా కలెక్టర్ చైర్మన్ గా, జీవీఎంసీ కమిషనర్, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సభ్యులు కావడంతో వారితో చెప్పించుకుని తమవారికి పోస్టులు దక్కించుకోవాలని కొంతమంది రంగంలోకి దిగి ఎమ్మెల్యేలతో, మంత్రులతో, ప్రభుత్వ పెద్దలతో సిఫార్సులకు తెరలేపినట్లు విశ్వాసనీయ సమాచారం ద్వారా తెలిసింది. ఈ పారిశుద్ధ్య కార్మికుల ఉద్యోగాలకు 18 ఏళ్ల నుంచి 42 ఏళ్ల వరకు అర్హులుగా నిబంధనలు పెట్టారు. రూ.15000 జీతంతో పాటు రూ.6 వేలు మెడికల్ అలవెన్స్ పేరిట మొత్తం రూ.21 వేలు జీతం ఇవ్వనున్నారు.

ఎస్ఎస్‌సీ జీడీ అభ్యర్థులకు పరీక్ష

విశాలాంధ్ర - హుకుంపేట: ప్రభుత్వం పోలీసు శాఖలో ఎస్ఎస్‌సీ జీడీ కానిస్టేబుల్ అభ్యర్థులకు స్థానిక మండల పరిధిలో బుధవారం స్థానిక ఎస్ఐ సతీష్ ఆధ్వర్యంలోని పరీక్ష నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలం నుంచి 86 మంది వరకు దరఖాస్తులు చేసిన వారిలో ఈ పరీక్షలకు 86 మంది హాజరయ్యారని తెలిపారు. 100 మార్కులకు గాను 75 పైబడి మార్కులు ఉత్తీర్ణత సాధించిన వారికి అల్లూరి జిల్లా కేంద్రంలో జిల్లాఎస్పీ, ఐటిడిఏ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ, భోజనం వసతి కల్పించడం జరుగుతుందన్నారు.

అనంతగిరి: మండల కేంద్రంలోని స్థానిక జూనియర్ కళాశాలలో పోలీస్ అభ్యర్థులకు ఎస్సై కరక రాము అవగాహన కల్పించారు. జీడీ కానిస్టేబుల్ సివిల్ ఎస్సై, సివిల్ కానిస్టేబుల్స్ పోస్టులకు దరఖాస్తులు చేసుకున్న వందమంది అభ్యర్థులకు బుధవారం ఉచిత రాత పరీక్ష నిర్వహించారు. స్ఫూర్తి కార్యక్రమంలో భాగంగా అర్హత సాధించిన అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇస్తామని, అభ్యర్థులకు ఉచిత భోజన సదుపాయం కల్పిస్తామని తెలిపారు.

మరమ్మతులకు గురైన కుళాయిలు

విశాలాంధ్ర - సీలేరు: జికేవీధి మండలం జికేవీధి పంచాయతీ దేరాల గ్రామంలో కుళాయిల పరిస్థితి ప్రారంభం రోజే మరమ్మతులకు గురయ్యాయి. పనులలో నాణ్యత లోపంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని బిజెపి మండల ప్రెసిడెంట్ జోగిరాజు, గ్రామస్థులు డిమాండ్ చేశారు.

ఇన్‌చార్జ్ తహశీల్దార్‌గా శ్యామ్

విశాలాంధ్ర - యస్.రాయవరం: యస్.రాయవరం ఇన్‌చార్జ్ తహశీల్దార్‌గా డిప్యూటీ తహశీల్దార్ శ్యామ్ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం పనిచేస్తున్న తహశీల్దార్ పి.శ్రీనువాసురావును జిల్లా కలెక్టర్ సస్పెన్షన్ చేయడంతో డిప్యూటీ తహశీల్దార్‌కు ఆ బాధ్యతలు అప్పగించారు. దీంతో బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

బాలింతలు నాటు వైద్యానికి దూరంగా ఉండాలి

విశాలాంధ్ర - హుకుంపేట: బాలింతలు స్థానికంగా నాటు వైద్యం చేసుకొని చిన్నారుల ప్రాణం మీదకు తీసుకురావద్దని మహిళ శిశు సంక్షేమశాఖ పీడీ సూర్యలక్ష్మి పేర్కొన్నారు. మండలంలో కులపాడు, సంతారి, దాలిగుమ్మడి అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి చిన్నారులకు అందుతున్న పోషణ, పిల్లల బరువు, రికార్డులు పరిశీలించి బాలింతలు, గర్భిణీలకు పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీ ప్రసవం అనంతరం స్థానిక నాటు వైద్యం తీసుకోవడం వలన పసిపిల్లలు ఇబ్బందులుపడే అవకశముందని పలు చోట్ల శిశు మరణాలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో బాలచంద్రమణిదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఓటర్ల సవరణ జాబితాలు త్వరితగతిన సిద్ధం చేసేందుకు సచివాలయంలో ఉన్న బిఎల్వోలు అత్యంత శ్రద్ధగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున అన్నారు. బుధవారం ఉదయం జిల్లాలో గల అందరి ఈఆర్వోల పరిధిలో గల సచివాలయ బిఎల్వోలతో ఈ విషయం పై నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున క్యాంపు కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా 2023 తయారు చేసేందుకు జిల్లాలో గల 18-19 సంవత్సరాలు మధ్య గల ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలని, అందుకు సచివాలయ బిఎల్వోలు ఇంటింటికీ తిరిగి సమాచారం సేకరించాలని అన్నారు. ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమంలో భాగంగా కొత్త దరఖాస్తుల స్వీకరణ, తొలగించాల్సిన పేర్లను పరిశీలించి వేగవంతంగా ఆన్లైన్ చేయాలని ఆదేశించారు. 18 -19 వయస్సు మధ్య గల వారందరిని ఫారం-6 ద్వారా కొత్త ఓటర్లుగా నమోదు చేయాలని అన్నారు. ప్రస్తుతం ఉన్న ఓటర్ల జాబితాలో చనిపోయిన వారి పేర్లను వారి సంబంధిత బంధువుల నుండి ఫారం-7 ద్వారా తీసుకొని ఓటర్ల జాబితా నుండి వారి పేర్లను తొలగించాలని తెలిపారు. అలాగే డబుల్ ఓటర్లను గుర్తించి వారికి ఓటు ఎక్కడ ఉండాలో నిర్ణయించి రెండవ ఓటు తొలగించాలన్నారు. శాశ్వతంగా వలస వెళ్ళిన వారిని గుర్తించి వారి పేర్లను ఓటర్ల జాబితా నుండి తొలగించాలని సూచించారు. ఒక పోలింగ్ స్టేషన్ పరిధిలో నివాసం ఉండి వేరే పోలింగ్ స్టేషన్ పరిధిలో ఓటరుగా నమోదై ఉంటే ఫారం -8 ద్వారా సరిచేయాలని సూచించారు. అదేవిదంగా తమ పరిధిలో గల కాలేజీలకు వెళ్లి జగనన్న విద్యా దీవెన జాబితా ద్వారా విద్యార్థుల నుంచి ఓటు నమోదుకు అవగాహన కలిగించాలని తెలిపారు. వీటిని తమ సచివాలయ పరిధిలో గల వారిని అదేరోజు ఆన్లైన్ లో నమోదు చేయాలని, మిగిలిన జాబితా సంబంధిత ఎఈఆర్వో లకు అందజేయాలని అన్నారు. అదేవిధంగా ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధాన ప్రక్రియలో చాలా వెనుకబడి ఉన్నామని ఫారం 6బి ద్వారా వేగవంతం చేయాలన్నారు. ఎలక్షన్ పాపులేషన్ నిష్పత్తి అధికంగా ఉన్నచోట పరిశీలించి ఓట్ల తొలగింపు, బదిలీ ప్రక్రియ చేయాలన్నారు. అనంతరం డిఆర్వో శ్రీనివాస మూర్తి మాట్లాడుతూ సచివాలయ పరిధిలో గల ప్రతి బిఎల్వో 18-19 వయస్సు గల ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదుకు ఇంటింటికీ తిరగాలని, జగనన్న విద్యా దీవెన డేటా ద్వారా ఆధారంగా కాలేజీలకు తిరిగి సేకరించాలని అన్నారు.

వైసీపీ పాలనలో ప్రజలు ఇబ్బందులు

విశాలాంధ్ర - పాయకరావుపేట: వైసీపీ ప్రభుత్వ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని టీడీపీ నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షులు కంకిపాటి వెంకటేశ్వరరావు ఆరోపించారు. మండలంలోని అరట్లకోట గ్రామంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమం నిర్వ హించారు. కంకిపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పెరిగిందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు అడ్డగోలుగా పెంచారన్నారు. తాగునీటి సమస్య, అవినీతి, విద్యుత్, రోడ్లు సమస్యలు పెరిగిపోయాయన్నారు. పండించిన పంటలకు గిట్టు ధరలు లేకపోవడమే కాకుండా, మూడు రాజధానుల రాజకీయాలు పెరిగిపోయాయని విమర్శించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చింతకాయల రాంబాబు, కట్టా శ్రీను, దేవవరపు గోవిందు, కుందూరు కుమార్, తుమ్మల బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడి పిల్లల బరువులపై ప్రత్యేక శ్రద్ధ

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: అంగన్వాడి కేంద్రాలలో గర్భిణీలు, బాలింతలకు, చిన్నారుల బరువులపై ప్రత్యేక దృష్టి సారించాలని అంగన్వాడి టీచర్ పవిత్ర అన్నారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాల మేరకు శిశు సంక్షేమ శాఖ అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సమన్వయంతో బుధవారం అరుకు, నేరేడువలస అంగన్వాడి టీచర్ పవిత్ర ఆధ్వర్యంలో కేంద్రంలోని నమోదైన వారిని బరువు,ఎత్తు వారి ఎదుగుదలపై పర్యవేక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా పవిత్ర మాట్లాడుతూ ప్రతి అంగన్వాడి కేంద్రంలోని నమోదైన చిన్నారులను, గర్భిణీ, బాలింతలకు ప్రతి నెల బరువు, ఎత్తు చూసి పరిశీలించాలన్నారు. అదేవిధంగా గర్భిణీ, బాలింతలు, చిన్నారులు ప్రతిరోజు అంగన్వాడి కేంద్రంలో వచ్చి వారికి ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు అంగన్వాడి టీచర్లు, ఏఎన్ఎంలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఏకపాత్రాభినయం పోటీలలో కాశీపురం విద్యార్థి ప్రతిభ

విశాలాంధ్ర - దేవరాపల్లి: మండలంలోని కాశీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి నంబారు హర్షవర్ధనకు, ఉపాధ్యాయుదు రాంబాబుకు ఏకపాత్రాభినయం పోటీలో ప్రతిభ చూపినందుకు గాను విశాఖపట్నం భీమిలి ఉపాధ్యాయ శిక్షణ కేంద్రంలో బుధవారం ఉపాధ్యాయ శిక్షణ కళాశాల ప్రిన్సిపల్ మాణిక్యం నాయుడు చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా దేవరాపల్లి మండల విద్యాశాఖ అధికారి సిహెచ్ రవీంద్రబాబు మాట్లాడుతూ ప్రతిభ అంటే ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులే చేయాలి అని ప్రసంశించారు. ఈ ప్రతిభ కనబరిచిన విద్యార్థి,ఉపాధ్యాయులకు పాఠశాల సిబ్బంది తదితరులు వారిని అభినందించారు.

బీసీ గర్జనలో ఆళ్ల పైడిరాజు టీం

విశాలాంధ్ర - పెందుర్తి: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విజయవాడలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన బీసీ మహా గర్జన కార్యక్రమంలో జీవీఎంసీ 88 వ వార్డు పార్టీ నాయకులు కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సీనియర్ నాయకుడు, జిల్లా కార్యదర్శి ఆళ్ల పైడిరాజు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు గర్జనలో పాల్గొని సందడి చేశారు.

విద్యార్థులు చదువు, క్రీడల్లో రాణించాలి: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విద్యార్థులు చదువుల్లోను ఆటల్లోను స్ఫూర్తితో గెలుపొంది ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున అన్నారు. బుధవారం ఉదయం స్థానిక పాత పోస్టాఫీసు వద్ద గల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల క్వీన్ మేరీని జిల్లా విద్యాశాఖ అధికారి చంద్రకళ తో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఫార్మేటివ్-2 పరీక్షల జవాబు పత్రాలను పరిశీలించి, విద్యార్థుల ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చదువులలోనూ, ఆటల్లోనూ విద్యార్థులు మంచి స్ఫూర్తితో పురోగతి సాధించాలని, ఉన్నత స్థానాలకు ఎదగాలని, మంచి పౌరులుగా దేశానికి సేవ చేయాలని ఉద్బోధించారు. విద్యార్థుల ప్రగతికి, క్రమశిక్షణకు సంబంధించి తగిన సూచనలు సలహాలు ఇవ్వడంతో పాటు "లీడ్ తరగతులను" పరిశీలించి విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకున్నారు. ఫార్మేటివ్-2 పరీక్షలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేసారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల క్వీన్ మేరీ ప్రధానోపాధ్యాయులు ఏ ధర్మేందర్ రెడ్డి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చిన తల్లి

విశాలాంధ్ర - హుకుంపేట: మండలంలోని కొట్నావల్లి పంచాయతీ పెదగరువు గ్రామానికి చెందిన కిల్లో విజయకుమారి అనే గర్భిణి 108లో ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చింది. మంగళవారం ఆమెకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించేందుకు 108 వాహనంలో బయలు దేరి వెళుండగా మార్గం మధ్యలో ఆమె ప్రసవించింది. 108లో గర్భిణికి సిబ్బంది ప్రథమ చికిత్స అందించి పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నట్లు ఈఎంటి చంద్రశేఖర్ తెలిపారు.

గెడ్డల ఆధునీకరణకు సమిష్టిగా కృషి

జివిఎంసి కమిషనర్ రాజాబాబు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: గెడ్డల ఆధునీకరణకు దేవాదాయ, రెవెన్యూ, ఫోర్ ట్రస్ట్, నేవల్ అధికారుల సమన్వయంతో వారి పరిధిలో ఉన్న గెడ్డలను మరమ్మత్తులు చేపట్టడం జరుగుతుందని జివిఎంసి కమిషనర్ పి రాజా బాబు పేర్కొన్నారు. బుధవారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా జోన్-5, 57వ వార్డు నందు సాకేతికపురం, ఎన్ఏడి కొత్త రోడ్డు, ఎన్ఏడి ఆఫీస్, ఎన్ఏడి పరిధిలో ఉన్న గెడ్డలను నేవల్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సింహాచలం, మురళినగర్, గోపాల్ పట్నం తదితర ప్రాంతాలలోని గెడ్డలు, నేవల్ ప్రాంతాల గుండా ప్రవహిస్తున్నందున ఆయా ప్రాంతాలలో గెడ్డలను శుభ్రం చేయుటకు ఆటంకాలు ఎదురవుతున్న దృష్ట్యా వివిధ డిపార్ట్మెంటుల అధికారులతో

సమీక్షా సమావేశం ఏర్పాటు చేసి అందరి సహకారంతో గెడ్డల ఆధునీకరణకు కృషి చేస్తామని కమిషనర్ నేవల్ అధికారులకు వివరించారు. గెడ్డలు శిధిలావస్థలో ఉన్నందున మురుగు పోయేందుకు ఆటంకం ఏర్పడుతుందని, ఎప్పటి నుండో కాలువల్లోనే సిల్ట్ ఉన్నందున కాలువలు పూడుకుపోయాయని వీటిని తీసేందుకు దేవాదాయ శాఖ, పోర్టుట్రస్ట్, రెవిన్యూ, జివిఎంసి సంయుక్తంగా కృషి చేయాల్సిన అవసరం ఉందని, ముఖ్యంగా వర్షాకాలంలో గెడ్డలో పూడుకులు అధికంగా ఉన్నందున సమీప ఇళ్లలోకి వరద నీరు చేరుతుందని, అంతేకాకుండా పందులు అధికంగా ఆ ప్రాంతంలో సంచరిస్తున్నందున వర్యావరణపరంగా ఇబ్బంది ఏర్పడుతుందని, నేవల్ ప్రాంతాలలో గెడ్డలు ప్రవహించినందున వ్యర్థాలను అడ్డుకునేందుకు గ్రిల్స్ ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందని, అందుకు మరోమారు సమన్వయ సమావేశం ఏర్పాటుచేసి శాశ్వత పరిష్కారం అయ్యేందుకు తగు చర్యలు తీసుకుంటామని కమిషనర్ నేవల్ అధికారులకు తెలియజేశారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ ఆర్.జి.బి. కృష్ణ, ఏసిపి అరుణ వల్లి, కార్య నిర్వహక ఇంజనీరు, ఏఎంఓహెచ్ డాక్టర్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు శ్రీప్రకాష్ విద్యార్థులు

విశాలాంధ్ర - పాయకరావుపేట: స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి ఖో ఖో పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 4 నుండి 6వ తేదీవరకు దివాన్‌చెరువులో జరిగిన సిబిఎస్ఈ క్లస్టర్ 7 ఖోఖో పోటీల్లో శ్రీప్రకాష్ విద్యార్థులు 8వ సారి ప్రథమస్థానం సాధించి అండర్ -19 బాలుర విభాగంలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను విద్యాసంస్థల అధినేతలు సీహెచ్‌వికె నరసింహారావు, సిహెచ్ విజయ్‌ప్రకాష్, ప్రిన్సిపాల్ ఎంవివిఎస్ మూర్తి, అపర్ణ, సత్యవర్థిని, కోచ్ చిరంజీవి అభినందించారు.

నిర్వాసితుల త్యాగాలను వృథా కానివ్వం

స్టీల్ సీఐటీయూ అధ్యక్షులు జె.అయోధ్యరామ్



విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: నిర్వాసితుల త్యాగాలను వృధా కానివ్వమని స్టీల్ సీఐటీయూ అధ్యక్షులు జె.అయోధ్యరామ్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ వడ్లపూడి ఏరియా కమిటీ ఆధ్వర్యంలో వడ్లపూడి కమ్యూనిటీ వెల్ఫేర్ సెంటర్‌లో ఏరియా కమిటీ 4వ మహాసభ బుధవారం నిర్వహించారు. అయోధ్యరామ్ మాట్లాడుతూ 16,500 కుటుంబాలు 25000 వేల ఎకరాల భూమిని త్యాగం చేసి ప్లాంట్ ఇక్కడికి రావడానికి ఆహ్వానించారని వారి త్యాగాలను వృధా కానివ్వమని తెలిపారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ నిర్మాణం నుంచి ఇప్పటివరకు సుమారుగా 250 మంది ఉద్యోగులు తమ ప్రాణాలను అర్పించారని గుర్తు చేశారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చేస్తే సహించేది లేదని ఎంత పెద్ద పోరాటాలకైనా, త్యాగాలకైనా సిద్ధంగా ఉన్నామని అన్నారు. యూనియన్ ఉపాధ్యక్షులు యు.రామస్వామి మాట్లాడుతూ పోరాటాలకు పురిటి గడ్డ వడ్లపూడి అని గతంలో జరిగిన అనేక పోరాటాలను కొనియాడారు. ఈ మహాసభలో యూనియన్ నాయకులు పి.నీలకంతం, మరిడయ్య, విశ్వనాథం, వీరాస్వామి, రామశేఖర్, సతీషు, డి ఎస్ వి ఎస్ శ్రీనివాస్ శివ పాల అప్పల రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. మహాసభ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంది. కర్ణం రెడ్డి జగ్గారావు అధ్యక్షులుగాను, సంతోష్ కుమార్ రాజ్ కార్యదర్శి గాను, మార్పు దానయ్య ఆర్గనైజింగ్ కార్యదర్శిగాను తోపాటు 15మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

టౌన్ ప్లానింగ్ "స్పందన"లో 12 ఫిర్యాదులు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జివిఎంసి పరిధిలో ఉన్న ఎనిమిది జోన్లలో ఉన్న పట్టణ ప్రణాళిక విభాగంలో అధికంగా వస్తున్న ఫిర్యాదులు నేపథ్యంలో జివిఎంసి కమిషనర్ పి. రాజాబాబు టౌన్ ప్లానింగ్ ఫిర్యాదుల కోసం ప్రతి బుధవారం ప్రత్యేకంగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడంలో భాగంగా చీఫ్ సిటీ ప్లానర్ బి సురేష్ కుమార్ ఆధ్వర్యంలో డిసిపిలు, ఏసీపీలు టౌన్ ప్లానింగ్ సిబ్బంది బుధవారం నిర్వహించిన టౌన్ ప్లానింగ్ స్పందన కార్యక్రమంలో 12 ఫిర్యాదులు అందినట్లు కమిషనర్ ఒక ప్రకటనలో తెలియజేశారు. జివిఎంసి పరిధిలో ఎలాంటి అనాధికార నిర్మాణాలు జరుగుతున్న, నిబంధనల ఉల్లంఘించి భవనాలు నిర్మించిన, భవన నిర్మాణ వ్యర్థాలపై, టౌన్ ప్లానింగ్ విభాగం పై ఎలాంటి ఫిర్యాదులనై నా ప్రత్యేక టోల్ ఫ్రీ ఫోన్ నెంబర్ ఏర్పాటు చేశామని ఈ ఫోన్ నెంబర్ కు 8187897569 ఫిర్యాదులు ప్రతి రోజూ నేరుగా తమ సమస్యను తెలియజేయవచ్చునని కమిషనర్ ఒక ప్రకటనలో తెలియజేశారు. వచ్చిన ఫిర్యాదులను దిగువ స్థాయి సిబ్బంది నుండి పై అధికారి వరకు వివరణ అడిగి తెలుసుకొని వచ్చిన ఆర్జీని తక్షణమే పరిష్కారమయ్యే విధంగా చూడాలని చీఫ్ సిటీ ప్లానర్ ని ఆదేశించారు.

విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

బీసీల సంక్షేమం గాలికొదిలిన వైసీపీ సర్కార్

- జనాభా ప్రాతిపదికన నిధులు ఇవ్వాలి
- కలెక్టరేట్ వద్ద టీడీపీ ఆందోళన

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : బీసీలకు ఈ ప్రభుత్వం వల్ల జరుగుతున్న అన్యాయాన్ని దౌర్జన్యాన్ని ప్రశ్నిస్తూ విశాఖ జిల్లా టీడీపీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. విశాఖ పార్లమెంట్ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 50% పైగా జనాభాగా ఉన్న వెనుకబడిన తరగతులు బీసీలకు గత మూడున్నర సంవత్సరాల నుండి తీవ్రమైన అన్యాయం జరుగుతున్నదని, చేతి వృత్తులు, కుల వృత్తులు చేసుకుంటూ జీవనం పొందే బీసీల అభివృద్ధి, పురోభివృద్ధి మృగ్యమై పోయిందన్నారు. బీసీలు హక్కుగా పొందాల్సిన సబ్ ప్లాన్ నిధుల నుండి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల వరకు ప్రతి అంశంలో నిరాధరణకు, దగాకు గురవుతున్నారు. 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదన్నారు. పైగా కార్పొరేషన్, సబ్ప్లె నిధుల్ని మళ్లించి బీసీలకు అన్యాయం చేశారని, ఇది ఇలాగే కొనసాగి నట్లయితే బీసీల కోసం తెలుగుదేశం పార్టీ నిరంతరం పోరాడుతూనే ఉంటుందన్నారు. పశ్చిమ నియోజక వర్గం శాసన సభ్యులు గణబాబు మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం 56 బీసీ కార్పొరేషన్లకు నిధులు కేటాయించి, ఖర్చు చేయాలని, షరతులు లేకుండా విదేశీ విద్య పథకాన్ని కొనసాగించాలని, ప్రభుత్వ సలహాదారులు, వైస్ చాన్సులర్స్ 34% బీసీలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దక్షిణ నియోజకవర్గం ఇంచార్జ్ గండి బాబ్జి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో రద్దు చేసిన 10 శాతం రిజర్వేషన్ల పునరుద్ధరణకు శాసనసభలో తీర్మానం చేయాలని, అందుకు ఎంపీలు పార్లమెంటులో కేంద్రంపై ఒత్తిడి చేయాలన్నారు. భీమిలి నియోజక వర్గం ఇంచార్జ్ కోరాడ రాజబాబు మాట్లాడుతూ కేంద్ర పథకాలకు రాష్ట్ర వాటా నిధులు ఇవ్వాలని, మత్స్యకారులకు సబ్సిడీపై వలలు, పడవల పంపిణీ పునరుద్ధరించాలన్నారు. జీవో నెంబర్ 217ను వెంటనే రద్దు చేయాలని, బీసీలకు చిన్న, మధ్యతరగతి పరిశ్రమల ఏర్పాటుకు అందించే రాయితీలను పునరుద్ధరించాలన్నారు. విశాఖ పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి పాసర్ల ప్రసాద్ మాట్లాడుతూ బీసీ స్టడీ సర్కిల్ లకు పూర్వ వైభవం కల్పించాలని, బీసీల పై దాడులు ఆపాలని, బీసీ నేతలపై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ అభ్యర్థి ఎం.శ్రీభరత్, రాష్ట్రపార్టీ కార్యదర్శులు బండారు అప్పలనాయుడు, వి ఎస్ ఎన్ మూర్తి యాదవ్, లొడగల కృష్ణ, బోండా జగన్, గంట నూకరాజు, రాష్ట్ర బీసీ సెల్ రాజమండ్రి నారాయణ, బిసి సెల్ పార్లమెంట్ అధ్యక్షులు తమ్మిన విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి అనసూరి మధు, జిల్లా పార్టీ నాయకులు పైలా ముత్యాల నాయుడు, విల్లూరి చక్రవర్తి, అబ్దుల్ గఫూర్, ఎర్నాగుల జగదీష్, తోటరత్నం, మల్ల శంకర్, నక్క కనకరాజు, దాసరి సత్య నారాయణ, మద్దిల రాజశేఖర్, కోనేటి సురేష్, బొద్దపు త్రినాధరావు, బొడ్డేపల్లి లలిత, ఈతలపాక సుజాత, విల్లా రామ్మోహన్ కుమార్, కేదారి లక్ష్మి, పొడుగు కుమార్, నడి గట్లశంకర్రావు, వాసుపల్లి రాజు, వాసుపల్లి దానేష్, గాడు అప్పలనాయుడు, సీఎం రమణ, మైలుపల్లి శ్రీనివాసరావు, ముక్త రాజారావు, పళ్ళ ఉమారాణి, కే.రమణారావు, లక్ష్మీ లావణ్య, తదితరులు పాల్గొన్నారు,

ఫ్రాన్స్ ప్రతినిధి బృందం గీతం సందర్శన

విశాలాంధ్ర - మధురవాడ : ఫ్రాన్స్ రాయబార కార్యాలయం ఉన్నత విద్యావిభాగం అధికారి డాక్టర్. ఫ్రాంకోర్న్విస్ క్సేవియర్ ఆధ్వర్యంలో ఫ్రాన్స్ ప్రతినిధి బృందం బుధవారం గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయాన్ని సందర్శించింది. కేంపస్ ఫ్రాన్స్ సహకారంతో ఏర్పాటైన ఈ సమావేశంలో గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం, రిజిస్ట్రార్ ప్రొఫెసర్. డి.గుణ శేఖరన్, ఎక్సటర్నల్ ఎఫైర్స్ సహయ డీన్ కమాండర్ గురుమూర్తి గంగాధరన్ లతో ఫ్రెంచి ప్రతినిధులు సమావేశం అయ్యారు. సంయుక్త అధ్యయనాలు, ఫిజియో థెరపీ, పబ్లిక్ పాలసీ, వాణిజ్య విద్యలో అంతర్జాతీయ ప్రమాణాలను నెలకొల్పడానికి కృషి చేస్తున్నట్లు గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ తెలిపారు. ఔషధ అధ్య యనాలు, సముద్రశాస్త్ర అధ్యయ నాలలో, గణిత శాస్త్ర పరిశోధనలలో గీతం భవిశష్య ప్రణాళికలను వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం వివరించారు. ఫ్రాన్స్ రాయబార కార్యా లయం ఉన్నత విద్యావిభాగం అధికారి డాక్టర్. ఫ్రాంకోర్న్విస్ క్సేవియర్ మాట్లాడుతూ ఏటా 500 మంది భారతీయ పరిశోధక విద్యార్థులకు ఫ్రాన్స్ స్కాలర్షిప్ లను అందిస్తున్నామని, ఫ్రాన్స్ లోని 32 విశ్వ విద్యాలయాలలో 73 మంది నోబెల్ బహుమతి గ్రహీతలు ఉన్నారని వెల్లడించారు. కార్యక్రమంలో ఫ్రాన్స్ ఉన్నత విద్య విభాగం మేనేజర్ వసుధ మల్లిఖార్జున, విద్యాసురేష్, కాంపస్ ఫ్రాన్స్ మేనేజర్ అజిత్ కుమార్, రెన్నస్ స్కూల్ ఆఫ్ బిజినెస్ దక్షిణాసియా మేనేజర్ మాద్ లీబార్స్, అలియన్స్ ఫ్రాంచేస్ డైరెక్టర్ డాక్టర్ శామ్యూల్ బెర్తెట్ తదితరులు పాల్గొన్నారు.

నూతన వేతన ఒప్పందం అమలు చేయాలి

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం : విశాఖ ఉక్కులో నూతన వేతనాలు అమలు చేయాలని యూనియన్ లకు అతీతంగా ఉక్కు నూతన కార్మికుల ఆధ్వర్యంలో ఎల్ అండ్ డిసి ఎదురుగా ధర్నాను నిర్వహించడం జరిగింది. 2017 సంవత్సరం నుండి నూతన వేతనాలు అమలు జరగాల్సి ఉన్నా ఇప్పటికీ అమలుకు నోచుకోకపోవడం చాలా బాధాకరమైన విషయమని, ఎన్ జె సి ఎస్ లో వేతన ఒప్పందం జరిగి ఏడాది గడుస్తుందని,ఇప్పటికే సెయిల్ ఉక్కు కర్మాగారాలలో కొత్త వేతనాలు అమలు జరిగి సంవత్సరం అవుతుందని, విశాఖ ఉక్కు లో కూడా కార్మికులందరికీ కొత్త వేతనాలు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంస్థ లక్ష్యాలకు అనుగుణంగా సంస్థ లోపల మరియు వెలుపల నుండి వ్యాపార వాతావరణంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొంటూ కోవిడ్ మహమ్మారి వున్న రెండు సంవత్సరాలలో ఉత్తమమైన పనితీరును అందించడంలో అందరికంటే ముందున్నామని, ఉత్సాహవంతమైన యువ శ్రామిక శక్తి అన్ని పరిస్థితులలో పనిచేయడానికి అంకిత భావంతో ఉన్నామని, వేతన సవరణ ఆలస్యమవుతున్నందున క్షీణిస్తున్న మా నైతికతను పునరుద్ధరించడానికి వేతన సవరణను తక్షణమే అమలు చేయాలని, 2017 కే గడువు ముగిసిందని ఇప్పటికే సెయిల్ లో విజయ వంతంగా కొత్త వేతనాలను అమలు చేయబడ్డాయని తెలిపారు. రానున్న పది రోజులలో మొత్తం యువ కార్మికులు అందరూ సంతకాలతో యాజమాన్యానికి మెమరాండం సమర్పించాలని నిర్ణయించినట్లు తెలియజేశారు. యూనియన్ లు కర్మాగారం ప్రైవేటీకరణ కాకుండా కాపాడడంతో పాటు, కార్మికుల ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకోవడం కోసం కూడా ముందుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో వందలాది యువ కార్మికులు మరియు కార్మిక సంఘాలు నాయకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపిక

- ఎంపికైన క్రీడాకారులుకు అభినందనలు
- జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు సునీల్ మహంతి

విశాలాంధ్ర - పియంపాలెం : విశాఖ గీతంయూనివర్సిటీ ఇండోర్ స్టేడియంలో జూన్25 నుంచి28 వరకు జరిగిన7వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లా జూనియర్ బాస్కెట్బాల్ ఛాంపియన్షిప్ పోటీల్లో విశాఖ తరుపు నుంచి ప్రాతినిధ్యం వాయించిన వారిలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన క్రీడాకారులకు జాతీయ స్థాయిలో పాల్గొనడానికి ఎంపిక చేయడంజరిగింది. అందులో విశాఖపట్నం నుంచి బాలుర విభాగంలో లొపి.లీలా కుమార్ కె.కార్తికేయ గణపతినాయుడు, సైఫ్ఉల్ల బాలిక విభాగంలో కే.సుమిత్ర, వై.హేమలత హేమ వున్నారు. ఎంపికైన క్రీడాకారులను జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు సునీల్ మహంతి అభినందించారు.అత్యంత ప్రతిష్టాత్మకంగా డిసెంబర్ నెల 9వ తేదీ నుండి 12వ తేదీ వరకు కేరళ రాష్ట్రంలో జరగబోయే జాతీయ స్థాయి జూనియర్ బాస్కెట్బాల్ పోటీలకు ఆంధ్ర ప్రదేశ్ జట్టుకు విశాఖ క్రీడాకారులు పాల్గొనటం విశాఖ జిల్లాబాస్కెట్ బాల్ అసోసియేషన్ కు గర్వకారణం అని సునీల్ మహంతి అన్నారు,ఎంపిక అయిన క్రీడాకారులు చిత్తూరులో కోచింగ్ కెంపు 24నవంబర్ నుంచి 6డిసెంబర్ 2022 తారీకు వరకు స్పెషల్ కోచింగ్ లో పాల్గొననున్నరు వీరిలో బాలికల విభాగంలో వై.హేమలత, జీ.హేమ,బాలుర విభాగంలో పి.లీలకుమార్, కే.కార్తికేయగణవతి నాయుడు ఎంపిక అయ్యారు.ఆంధ్ర ప్రదేశ్ బాలుర జట్టుకు మన విశాఖ పట్టణం క్రీడాకారుడును సారధిగా పి.కుమార్ వ్యవహరించడం మనకి గర్వకారమన్నారు. ఈ సందర్భంగా జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ చైర్మన్ టి.ఎస్.ఆర్.ప్రసాద్, అధ్యక్షులు సునీల్ మహంతి, కార్యదర్శి జి.భూషనరావు ఓప్రకటనలో మీడియాకు తెలిపారు. జాతీయస్థాయిలో ప్రాతినిధ్యం వహిస్తున్న బాస్కెట్ బాల్ క్రీడాకారులకు విశాఖపట్టణం జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ ప్రతనిధులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

త్వరలో జిల్లా రిలీఫ్ ఫండ్ ప్రారంభం

జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : త్వరలో జిల్లా రిలీఫ్ ఫండ్ ను ఏర్పాటు చేసి దాని విధివిదానాలను ప్రకటిస్తామని జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున అన్నారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా స్థానిక సిరిపురం ఉడా చిల్డ్రన్ థియేటర్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో విభిన్న ప్రతిభావంతులకు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లా స్థాయిలో జరిగిన క్రీడా పోటీల్లో గెలుపొందిన విన్నర్స్ , రన్నర్స్ 450 మందికి సర్టిఫికేట్స్ మరియు బహుమతులను జిల్లా కలెక్టర్ అందజేసారు. అదే విదంగా అర్హులైన 10 మంది విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల వాహనాలు, నలుగురికి లాప్ ట్యాప్ లు ఇద్దరికి టచ్ ఫోన్లను పంపిణీ చేసారు. స్వయం ఉపాధి పథకం కింద మరో ముగ్గరికి 8 లక్షల రూపాయలను పంపిణీ చేసారు. అనంతరం విభిన్న ప్రతి భావంతులు విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల వస్తువులతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాల్స్ ను జిల్లా కలెక్టర్ ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ జాయింట్ డైరక్టర్ రమణమూర్తి, డి ఇ ఓ చంద్రకళ, బిసి వెల్ఫేర్ అధికారి శ్రీదేవి, పిఒఎస్ఎస్ఎ శ్రీనివాసరావు, ఆర్.సి.డి. హస్పటల్ సూపరింటెండెంట్ విఠల్, విద్యార్థులు పాల్గొన్నారు.

వానరాన్ని కాపాడిన విద్యుత్ సిబ్బంది

విశాలాంధ్ర - సీలేరు : సీలేరు ప్రభుత్వ ఆసుపత్రి వెనుక 11 కెవి విద్యుత్ స్తంభంపై బుధవారం ఉదయం ఒక కోతి యొక్క చేతులు చిక్కుబడిపోయి ఆర్తనాదాలు చేస్తోంది. దీన్ని గమనించిన స్థానికులు విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో విద్యుత్ సిబ్బంది స్పందించి కోతిని రక్షించారు. చేతులు ఇరుక్కొని అవస్థలు పడుతున్న కోతిని కాపాడటంపై విద్యుత్ సిబ్బందిని పలువురు అభినందించారు.

కమ్మేస్తున్న మంచు

విశాలాంధ్ర - నాతవరం : నాతవరం మండలంలోని అన్ని గ్రామాలు నాలుగ రోజుల నుంచి మంచు ముసు గులో దర్శన మిస్తున్నాయి. ఉదయం పది గంటల వరకు మంచు విపరీతంగా కురుస్తోంది. రోడ్డుపై ప్రయాణించే వారికి దగ్గరకు వచ్చే వరకు వాహనాలు కనిపించక పోవడం ఇబ్బంది పడుతున్నారు. అలాగే వాకింగ్ చేసేవారు ఉదయం వేళలలో మంచుతో ఇబ్బంది పడుతున్నారు. మంచుతో పాటు చలి కూడా ఉండటంతో పల్లెల్లో చలిమంటలు వేసుకుంటున్నారు.

పంచాయతీ ప్రణాళికపై శిక్షణ

విశాలాంధ్ర - మాకవరపాలెం : మాకవరపాలెం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ అరుణశ్రీ ఆధ్వర్యంలో బుధవారం గ్రామ పంచాయతీ, మండల పరిషత్ అభివృద్ధి ప్రణాళికపై పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అభివృద్ధి ప్రణాళికలోని పలు విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్లు, ఎంపిటిసిలు కూడా పాల్గొన్నారు.

'ఇదేంకర్మ బీసీలకు' కార్యక్రమానికి తరలివెళ్లిన టీడీపీ నాయకులు

విశాలాంధ్ర - మాకవరపాలెం : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్య క్షులు నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు, మాజీ మంత్రి చింత కాయల అయ్యన్నపాత్రుడు పిలుపుమేరకు బుధవారం అనకా పల్లిలో జరిగిన ఇదేం కర్మ మన బీసీలకు అనే కార్యక్రమానికి మాకవరపాలెం మండల టీడీపీ నాయకులు తరలివెళ్లారు. ఈ కార్య క్రమంలో మాజీ జెడ్పీటీసీ రుత్తల శేషుకుమార్, శెట్టిపాలెం సర్పంచ్ అల్లు రామునాయుడు, మండల టిడిపి ఉపాధ్యక్షుడు చిరంజీవి, స్వామి, మాకవరపాలెం ఉప సర్పంచ్ లాలం రాము, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభలు విజయవంతం చేయండి

విశాలాంధ్ర - పరవాడ : ఈనెల 18, 19 తేదీల్లో పరవాడలో జరగనున్న సిఐటియు జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు ఫార్మాసిటీలో బుధవారం ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సంధర్భంగా సీటు జిల్లా ప్రధాన కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ సిఐటియు జిల్లా 12వ మహాసభలు తొలిసారిగా పరవాడలో జరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రాంతంలో ఉండే ఉద్యోగ, కార్మిక సమస్యలపై సమర శంఖాన్ని పూరించడం కోసం దోహదపడతాయన్నారు. 18న ఉదయం 10 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయం కూడలి నుంచి సంతబయలు వరకు భారీ కార్మిక ప్రదర్శన అనంతరం బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ బహిరంగ సభకు సీఐటియు రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్ నరసింహరావు, రాష్ట్ర కార్యదర్శి కె.స్వరూపరాణి, జిల్లా అధ్యక్షుడు ఆర్ శంకరరావు, ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు తదితర నాయకులు హాజరై ప్రసంగిస్తారన్నారు. అనంతరం రెండు రోజులు పాటు పరవాడ సీతారామ కళ్యాణ మండపంలో ప్రతినిధుల సభ జరుగుతుందని చెప్పారు. ఫార్మాసిటీలో కార్మిక చట్టాలు, ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు తదితర సమస్యలపై సిఐటియు ఎనలేని పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. స్కీం వర్కర్లు అసంఘటితరంగ కార్మికులైన ఆటో, ముఠా, బిల్డింగ్ తదితర కార్మికుల హక్కులకై పోరాటాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎన్టీపీసీలో కాంట్రాక్ట్ కార్మికులకు మెరుగైన వసతులు, కనీస వేతనాలపై నిత్యం సిఐటియు కృషి చేస్తుందన్నారు. పరవాడలో జరుగుతున్న మహాసభలను కార్మిక వర్గం యావత్తు పాల్గొని జయప్రదం చేయాలని గనిశెట్టి పిలుపు నిచ్చారు.

ఏకాభిప్రాయంతో పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తాం

విశాలాంధ్ర - కె.కోటపాడు : ఏకాభిప్రాయంతో ముఖ్య నాయకులు ను కలుపుకొని త్వరలో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని దిగ్విజయంగా చేవడతామని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు రొంగలి మహేష్ అన్నారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు బుధవారము మండల పార్టీ సమావేశము నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షులు మహేష్ మాట్లాడుతూ నియోజకవర్గ ముఖ్య నాయకులైన ఇన్చార్జి పీ వీ జీ కుమార్. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు. పైలా ప్రసాదరావు లతోపాటు మండలంలోని ముఖ్య నాయకులను కలుపుకొని ఈ కార్యక్రమాన్ని ప్రతిరోజు సాయంత్రం పూట నిర్వహిస్తామన్నారు. వైయస్సార్ ప్రభుత్వము చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ నిర్వహిస్తామన్నారు .2024 లో జరుగు అసెంబ్లీ ఎన్నిక ల లో తెలుగుదేశం పార్టీ గెలుపే ధ్యేయంగా ప్రతి నాయకున్ని కార్యకర్తలను కలుపుకొని ఇదేమి కర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆదేశారు మేరకు విజయవంతంగా నిర్వహిస్తామని అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు గ్రామ సర్పంచి దాడి ఎరుకు నాయుడు. సింగన్న దొరపాలెం గ్రామ సర్పంచ్ వెలగల పైడిమ నాయుడు. సీనియర్ టిడిపి నాయకులు భక్తి వెంకటరమణ. బండారు నరసింహనాయుడు. సబ్బవరపు రామానాయుడు. పూడి నారాయణమూర్తి. పూడి శ్రీనివాసరావు. ఎంపీటీసీ కసిరెడ్డి దేవుడు బాబు. కసిరెడ్డి అప్పలనాయుడు. మొదలగు వారు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వం ప్రజలను పక్కదారి పట్టిస్తోంది : బివి.రామ్

విశాలాంధ్ర - విశాఖ సిటీ : అసలు బిల్లు లేకుండానే మూడు రాజధానులు అంటూ పక్కదారి పట్టిస్తున్న వారిపై కేసులు పెట్టాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మంత్రులతో పాటు అనేక మంది ప్రజాప్రతినిధులు మూడు రాజ ధానులు అంటూ ప్రచారం చేయడాన్ని రామ్ ఖండించారు. ఇదే విషయమై వీజేఎఫ్ ప్రెస్ క్లబ్ లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ .. ఈనెల 17వ తేదీన తను ఢిల్లీ వెళ్ళబోతున్నానని ఇదే విషయమై కేంద్ర హెూమ్ శాఖకు ఫిర్యాదు చేస్తానన్నారు. వాస్తవానికి గత డిసెంబర్ నెలలోనే మూడు రాజధానుల బిల్లును రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో వెనుకకు తీసుకుందని ప్రస్తావించారు. బిల్లులో లోపాలను సవరించి పూర్తిస్థాయి బిల్లును మళ్ళీ ప్రవేశపెడతామని ప్రకటించిన ప్రభుత్వం ఇంతవరకు ఎందుకు 3 రాజధానుల బిల్లును ఎందుకు ప్రవేశపట్టలేకపోయిందని ప్రశ్నించారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం బీసీల కోసం ఎంతో చేస్తున్నామని ప్రకటిస్తున్నప్పటికీ.. బీసీలకు చేసింది ఏమీ లేదన్నారు. కీలకమైన అన్ని పదవులలోనూ ముఖ్యమంత్రి సామాజిక వర్గానికి చెందిన వారే ఉన్నారని.. ప్రాధాన్యత లేని పోస్టులలో బీసీలు కొనసాగుతున్నారని పేర్కొన్నారు.

రక్తదానం..ప్రాణ దానం : కేఎన్ఆర్

విశాలాంధ్ర గాజువాక సిటీ : గాజువాక వుడాకాలనీ ఆదర్శ్ గ్రౌండ్లో ఏ.బి గ్రూప్ ,ఓ.ఎస్.జి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన గాజువాక అసెంబ్లీ నియోజకవర్గం కోఆర్డినేటర్ కరణం రెడ్డి నర్సింగరావు ప్రారంభించారు రక్తదాతలకు సర్టిఫికెట్స్ పండ్లు పంపిణీ చేసి అభినందించారు. ఐదువేల రూపాయలు ఆర్థికసాయం మధ్యాహ్న భోజనాలు కేఎన్ఆర్ ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ రక్త ధానం చేయడమంటే ప్రాణ ధానం చేయడంతో సమానమని అన్నారు. రక్త దానం చేసిన ప్రతి ఒక్కరికి రెండు లక్షల రూపాయల బీమా సదుపాయం కూడా సంస్థ తరవున ఇస్తున్నందుకు నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో జబర్దస్త్ డాన్స్ మాస్టర్ రమేష్, పల్సర్ బైక్ డాన్సర్ జాన్సీ, లక్స్ రాజు, ఏఎన్ఆర్ హెల్పింగ్ హాండ్స్ ఏ.నరేంద్రరావు, రంజిత్, రాహుల్ షా, సంస్థ ప్రతినిధులు హరీష్, రాజు యశ్వంత్, పలువురు జవానులు మాజీ సైనికులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ ఉద్యోగాలకు అర్హత పరీక్ష

విశాలాంధ్ర - దుంబ్రిగూద : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పోలీసుశాఖలో కానిస్టేబుల్ నియమకాలకు ఉత్తర్వులు జారీ చేసింది. దీంట్లో భాగంగా మండల కేంద్రం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కానిస్టేబుల్ ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకున్న యువతి, యువకులకు పోలీసుశాఖ ఆధ్వర్యాన బుధవారం రాత పరీక్షను నిర్వహించారు. దీనికి ముందు యువతి, యువకులకు శారీరక ధారుద్య పరీక్షలతోపాటు, ఎత్తు కొలతలను నిర్వహించారు. ఎస్సై సంతోషకుమార్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. గిరిజన యువతి, యువకులు పోలీసుశాఖలో ఉద్యోగాలు అన్వేసించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. రాత పరీక్షతోపాటు, శారీరక దారుఢ్య పరీక్షలను చేపట్టడం జరిగిందన్నారు. ఇందులో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు పోలీసుశాఖ ద్వారా ఉచిత శిక్షణను నిచ్చేందుకు చర్యలు చేపట్టిందని ఆయన పేర్కొన్నారు. దీన్ని యువతి, యువకులు సద్వినియోగ పరుచుకోవాలని ఆయన కోరారు. అనంతరం పరీక్షకు హాజరైన అభ్యర్థులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, జూనియర్ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఐదు పంచాయతీల్లో ఎంపీడీఓ పర్యటన

విశాలాంధ్ర - జీకేవీధి : మండలంలోని ఐదు పంచాయతీల్లో జీకేవీధి ఎంపీడీఓ ఉమా మహేశ్వరరావు బుధవారం పర్యటించారు. ముందుగా గాలికొండ పంచాయతీ సచివాలయంను సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి సిబ్బందితో మాట్లా డారు. సిబ్బంది అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ సూచించారు. ధార కొండ పిహెచ్సిలో ఆశ కార్యకర్తలు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతీ శుక్రవారం డ్రైడేగా పాటించే విధంగా గ్రామాల్లో అవగాహన తీసుకు రావాలని చెప్పారు. అనంతరం గుమ్మిరేవుల, దుప్పిలవాడ పంచాయతీలో సచివాలయాలను సందర్శించారు. గడప గడపన మన ప్రభుత్వం గైడ్లైన్స్ గురించి సచివాలయ సిబ్బందికి తెలియజేశారు. అనంతరం సీలేరులో పారిశుద్ధ్య పనులను ఎంపీడీవో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పాపారావు, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతంలో పాఠశాల ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - సీలేరు : అల్లూరి సీతారామరాజు జిల్లా గిరిజన ప్రాంతంలో అన్ని సౌకర్యాలు గల పాఠశాల ఏర్పాటు చేయాలని ఒడిశా రాష్ట్రం కళింగ విద్యా సంస్థల యాజమాని, కంద మాల్ పార్లమెంట్ సభ్యులు అచ్యుతానంద సమంతను కోరడం జరిగిందని భారతీయ ఆదివాసుల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు గడుతూరి రాంగోపాల్ తెలి పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అచ్యుత నంద సమంత విద్యావేత్త, ఆయన మన దేశంలో ఒడిశా రాష్ట్రంలో, బంగ్లాదేశ్ వంటి దేశాలలో సుమారు 300 పాఠశాలలు, ఇంజనీరింగ్ కళాశాల, మెడికల్ కళాశాల, డిమ్డ్ టుబి యూనివర్శిటీ విజయ వంతంగా నడుపు తున్నారన్నారు. పేద గిరిజన విద్యార్థినీ విద్యార్థులకు ఉచితంగా కేజి టు పేజి విద్యను అందిస్తూ విశేష సేవలను అందిస్తున్నారన్నారు. ఆయన విద్యారంగంట చేస్తున్న సేవలను గుర్తించి అనేక దేశాలు ఆయనకు అనేక అవార్డులు అందజేశా యన్నారు. ఈయన యూనివర్శిటీ గ్రాంట్స్ కమీషన్ సభ్యుడుగా రెండు దఫాలు పని చేశారన్నారు. ఏఐసిటిఇ సభ్యుడు వంటి అనేక విశిష్ట పదవులను చేపట్టారన్నారు. ఒడిశా రాష్ట్రంలో సరైన విద్యా సదుపాయాలు లభించని మారుమూల, వెనుక బడిన, గిరిజన జిల్లాలలో స్కూల్స్ ఏర్పాటు చేశారన్నారు. పొరుగున ఒడిశా రాష్ట్రంలో మారుమూల గిరిజన ప్రాంతాల్లో స్కూల్స్ ఏర్పాటు చేసనట్లే అల్లూరి సీతా రామ రాజు జిల్లా గిరిజన ప్రాంతంలో పాఠశాలలు ఏర్పాటు చేయాలని కోరగా సానుకూలంగా స్పందించి తప్పక పాఠశాలలు ఏర్పాటు చేయడానికి ప్రయత్నం చేస్తానని తనను భువనేశ్వర్ వచ్చి కలవమని చెప్పారని రాంగోపాల్ తెలిపారు.